# కర్మఫలం

మనం చేసే ప్రతీ దానిలో తప్పకుండా 3 స్థాయిలు ఇమిడి ఉంటాయి. అవి కర్త, కర్మ, కర్మఫలం. మామూలుగా చాలా మంది దృష్టి కర్మఫలం మీదనే ఉంటుంది. వారికి పనిలో కేవలం పని చేయడమే తృప్తినివ్వదు. వారు చివరికి లభించే ఫలితానికే నిజమైన విలువను ఇస్తారు. దీని వలన పని కేవలం మాధ్యమంగా తయారౌతుంది, చివరికి లభించే ఫలితం మీదనే ఆ పని ఆధారపడి ఉంటుంది. వీళ్ళు ఏదో సాధించడం కోసం పని చేస్తారు గానీ, పనిని ఆనందంగా ఇష్టంతో చేయరు.

అంటే ఇక్కడ కర్త గత అభిప్రాయాలను పట్టుకుని ఉంటాడు, కర్మ లేక పని అనేది వర్తమానంలో ఉంటుంది, ఫలితం అనేది భవిష్యత్తులో ఉంటుంది. ఇలా కర్త లేదా జీవాత్మ ఒకటిగా కాకుండా మూడుగా విభజింపబడి ఉండడం వలన పని చేయడం అనేది ఒక భారంగా ఉండి, ఏదో విధంగా పూర్తి చేయాలనిపిస్తుంది. ఎందుకంటే చివరికి వచ్చే ఫలితమే సాధించవలసినది కనుక. మీరు పని చేయకుండా చివరికి వచ్చే ఫలితాన్ని పొందగలిగితే, మీరు పనిని ఎన్నటికీ చేయరు.

కనుకనే అనుభవజ్ఞానమున్నవారు ఫలాపేక్షలేకుండా పని చేయమని చెబుతారు. ఎందుకంటే కేవలం మీరు పని మీదనే దృష్టిపెట్టి, దానిలో ఉత్పన్నమౌతున్న కష్ట-సుఖాలను దైవ ప్రసాదంగా భావించి అనుభవిస్తూ ఆ పనిని ఇష్టంగా చేస్తే, ఆ పనులలో సృజనాత్మకత నెలకొని ఊహించనివి సృష్టించగలుగుతారు. దీని వలన ఫలాపేక్షలేనప్పటికీ దానంతటదే సహజంగా కర్మఫలం మీకు లభిస్తుంది. అలాగే చేస్తున్నప్పుడే మీరు ఆనందాన్ని అనుభూతి చెందడం వలన ఫలితం పట్ల మీకున్న వ్యామోహం దానంతటదే సహజంగా తగ్గిపోతుంది. ఎందుకంటే ఫలితం పొందిన తర్వాత వచ్చే ఆనందం పని చేస్తున్నప్పుడే మీకు లభిస్తుంది.

ఉదాహరణకు మీరు అష్టా-చెమ్మా ఆడుతున్నప్పుడు మీకు రెండు పడితే గెలుస్తారనుకోండి. మీకు కావలసినది ఎల్లప్పుడూ తప్పక పడుతుందని ఎవరూ గ్యారంటీ ఇవ్వలేరు. ఇప్పటివరకూ ఎవరికీ సాధ్యం కాలేదు. కాని మీరు వేసే నాలుగు గవ్వల యొక్క సహాయం మీకు లభిస్తే మీరనుకున్నది పడే అవకాశం ఉన్నది. రెండు గవ్వలు బోర్ల, రెండు గవ్వలు వెల్లకిలా పడినప్పుడే రెండు పడుతుంది. అంటే గవ్వలు వేసినప్పుడు కన్ను(1), రెండు, మూడు, చమ్మా(4), అష్టా(8) ఈ అయిదు ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. రెండు పడితే గెలుస్తారు మిగతా నాలుగు అవకాశాలు పడితే ఓడుతారు. కనుక మిగతా నాలుగు అవకాశాల సహాయం ఉన్నప్పుడే మీరు గెలుస్తారు. అంటే ఓటమి సహాయం ఉంటేనే మీరు గెలుస్తారని, లేకుంటే ఓడిపోతారని దీని అర్థం.

కనుకనే నేను మిమ్మల్ని గెలుపు-ఓటములకు, రాగ-ద్వేషాలకు అతీతంగా చేరమని చెబుతున్నాను. ఎందుకంటే ఈ ఆటలో నాలుగు గవ్వల యొక్క మరియు అయిదు అవకాశాల యొక్క సహాయం ఆట పూర్తయ్యే వరకూ అవసరం కనుక. దీనిని అర్థం చేసుకుని గవ్వలు వేస్తున్న ప్రతీసారి నాకు ఇది కావాలి అని అనుకుని మిగతా వాటి సహాయాన్ని అర్థించండి. కనుక అనుకున్నది పడకుంటే ఆ ఫలితాన్ని ద్వేషించకుండా ఆ బాధను ఓటమిని ఇష్టంగా అనుభవించి గెలుపు-ఓటమిల పట్ల సమదృష్టిని తెచ్చుకోండి.

మరొక ఉదాహరణ క్రికెట్ ఆడుతున్నప్పుడు 100 కి.మీ. స్పీడ్‌తో బౌలర్ బంతి వేస్తాడని బ్యాట్స్‌మెన్ ఆశిస్తే, అంతే స్పీడ్‌లో వేస్తే కొట్టగలుగుతాడు, లేకుంటే కొట్టలేడు. ఇక్కడ ఆశించడం ఊహించడం వలననే బంతిని సరిగా చూసి ఆడలేకపోతున్నాడు. ఏమి ఆశించకుండా స్వచ్ఛంగా ఉంటే లేదా ఎలాంటి బంతినైనా వేయవచ్చు అని తటస్థంగా ఉండి అన్ని రకాల బంతులను ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉంటే, బంతిని సరిగ్గా గమనించి దానిని బ్యాట్‌తో కొట్టగలుగుతాడు.

ఇలా మీకు కూడా స్థిరమైన నమ్మకాలు, అభిప్రాయాలు, ఆశించడాలు, ఊహించడాలు ఉండడం వలన, ఏదైనా చేస్తున్నప్పుడు వాటికి సంబంధించిన ఆలోచనలను మీ మనసులో మెదలడం వలననే వాస్తవాన్ని, జరుగుతున్నదాన్ని ఉన్నది ఉన్నట్టుగా చూడలేకపోతున్నారు. వీటి వలననే మీరు వర్తమాన క్షణంలో ఉండలేకపోతున్నారు. కనుక మీరు చేసే అన్ని పనులలో, అలాగే ఇతరులతో వ్యవహరించేటప్పుడు ఏమీ ఆశించకుండా ఉండండి లేదా అన్నీ ఆశించండి. అప్పుడే వారి ప్రవర్తన ఎలా ఉన్నా దానికి తగ్గట్టుగా మీరు స్పందించగలుగుతారు. ఇలా మీరు లోతుగా ఆలోచిస్తే ప్రతి పనిలో దానికి సంబంధించిన అన్ని అవకాశాల యొక్క సహాయం తప్పక అవసరమవుతుందని తెలుసుకుంటారు.

వ్యతిరేక ఫలితాన్ని ద్వేషించినా కూడా ఫలితాలు వస్తాయి. కాని వ్యతిరేకమైన దాని పట్ల భయం అలానే ఉంటుంది. ఓటమిని, అనారోగ్యాన్ని లేదా కోపాన్ని లేదా ఇతర చెడు గుణాలను ద్వేషించినా అణిచివేసినా మీకు గెలుపు, ఆరోగ్యం లేదా శాంతం లభించవచ్చు. కాని వ్యతిరేకమైనవి మళ్ళీ వచ్చి ఇబ్బంది పెడతాయేమోననే టెన్షన్ మీకు తప్పకుండా ఉంటుంది. అలా కాకుండా ఓటమి, అనారోగ్యం లేదా కోపం సహాయంతో మీకు గెలుపు, ఆరోగ్యం లేదా శాంతి లభిస్తే, అప్పుడు వ్యతిరేకాల మధ్య శత్రుత్వం తొలగిపోయి, మిత్రత్వం అనేది ఆరంభమౌతుంది.

## కర్మ

కర్మ అంటే పని, ఏదో ఒకటి చేయాలని ఎంపిక చేసుకోవడం, దాని ద్వారా ఉత్పన్నమయ్యే కష్ట-సుఖాలను అనుభవించడం. మూడు రకాల కర్మలు అంటే తమో, రజో, సత్వ గుణకర్మలు మనకు

నిత్యజీవితంలో తప్పక అవసరమౌతాయి. పరిస్థితిని బట్టి మూడు కర్మలను చేయాల్సి వస్తుంది. కనుక మూడు గుణాల పట్ల సమభావన రావడానికి సాధన చేయాలి. వీటి గురించి మరింత సమాచారం కోసం రాగ-ద్వేషాలు, అంతర్ ప్రయాణం అనే టాపిక్‌లను చదవండి.

కాని కొందరు కర్మ చేస్తే కర్మ ఫలం అంటుకుంటుందని కర్మలు చేయడానికి భయపడతారు. కానీ కర్మ యోగి ఈ విచిత్ర స్థితి నుండి సులభంగా బయటపడతాడు. అతను ఫలితాన్ని త్యాగం చేస్తాడు గానీ కర్మలను త్యాగం చేయడు. అతని కర్తవ్యం అనుభవ జ్ఞానాన్ని పొందడం, ఆ జ్ఞానంతో సూర్యుడిలా ప్రకాశిస్తూ దానిని అందరికీ వ్యాప్తి చేయడం, అవకాశమిస్తే తెలుసుకున్న దానిని ఇతరులకు పంచడం. అతను ఈ లోకంలోనే ఉంటాడు కాని సన్యాసి మాదిరిగా. అన్ని కార్యాలను చేస్తుంటాడు, కానీ వానిలో ఆపేక్ష ఉండదు. తన సంతానం నుండి గాని, ప్రజల నుండి గాని ఎటువంటి ఆపేక్ష అతనికి ఉండదు. స్వయంగా సన్యాసిగా అనుభూతి చెందుతాడు, కానీ లోకానికి సంసారి మాదిరిగా లాభం చేకూరుస్తాడు. దేనిని వదిలించుకోవాలని చూడకుండా అన్నింటిలో తామరాకు మీద నీటి బొట్టులా ఉంటాడు. అంటే అన్నింటిలో సంపూర్ణంగా పాల్గొంటాడు, కానీ దేనికీ అంటకుండా ఉంటాడు.

**కర్త**

చాలా మంది నిరంతరం ఏదో ఒక పని చేయకుండా ఉండలేరు. కనీసం ఎరుకలో పది నిముషాలు కూడా ఏమీ చేయకుండా శరీరానికి, మనసుకు మరియు హృదయానికి అతీతంగా చేరి ఒంటరిగా వారితోవారు ఏమీ చేయకుండా హాయిగా ఉండలేరు. కావాలనే ఏదో ఒక పనిని కల్పించుకుని నిత్యజీవితాన్ని గడుపుతూ ఉంటారు. ఇక్కడ టి.వి. చూడడం, ఆలోచించుకుంటూ కూర్చోవడం కూడా పని చేయడమే అవుతుందని గ్రహించండి.

ఎవరికి ఎప్పుడు ఎంత చేయాలో అంతే చేయాలి, అంత వరకు ఏమీ చేయకుండా తటస్థంగా ఉండాలి. కాని చాలా మంది ఏదో చేయకుండా ఉండలేరు కనుక అనవసరమైన విషయాలలో తలదూర్చి సమస్యలు కొని తెచ్చుకుంటారు. వారనుకుంటారు పనిని మేమే చేస్తున్నామని, కాని ఇక్కడ గ్రహించవలసిన విషయం ఏమిటంటే, పనులు వాళ్లు చేయటం లేదని, పనులే వారిపై ఆధిపత్యాన్ని అధికారాన్ని చలాయిస్తున్నాయని. పనులు చేయడానికి ఇది ఉచిత సమయమా కాదా అని వారు నిర్ణయించడం లేదు. ఎందుకంటే తప్పనిసరిగా ఏదో ఒకటి చేయకుండా ఉండలేరు కనుక.

కాని యోగి ఎలాంటి కర్మలు చేస్తున్నాను, దీని వలన కర్మఫలితం ఏమి లభిస్తుంది అనేదానిని కూడా పట్టించుకోకుండా కేవలం కర్మపైనే అధికారం ఉంచడానికి ప్రయత్నిస్తాడు. కర్మ తప్పక చేయాలి అనే స్థితిని కూడా అధిగమించి కర్మలు ఎప్పుడు చేయాలనేది తనే నిర్ణయిస్తాడు. రాగ-ద్వేషాలకు

అతీతంగా చేరిన తర్వాతే పనులను చేయడానికి సిద్ధపడతాడు, ఎందుకంటే అప్పుడు దేని మీద ఆధారపడని ఆనందం తన స్వంతమవుతుంది. కనుక కర్మ చేయడం ద్వారా, కర్మఫలితం ద్వారా వచ్చే ఆనందం మీద తను ఆధారపడి ఉండడు. అలాగే అతీతపు స్థితికి చేరితే తను దైవంతో మమేకమై పోతాడు, దీనినే యోగం అంటారు. ఈ స్థితిలో ఏది జరిగినా అది దివ్యమైనదే అవుతుందని, అలాగే దివ్యమైన ఫలం కూడా తప్పక లభిస్తుందని అతనికి తెలుసు. దీని వలన అతనితో పాటు సమస్త సృష్టి ఎదిగి లోక-కల్యాణం కూడా జరుగుతుంది.

అనగా యోగంలో ఏది జరిగినా లేదా దైవం వద్దకు చేరడానికి లేదా దైవీక గుణాలను పెంపొందించుకోవడానికి మీరు ఏది చేసినా, మీకు ఏదీ అంటదు. అంటే కొత్త కర్మలు అంటకపోవడమే కాకుండా పాత కర్మలు కూడా కరిగిపోతాయి. అలా కాకుండా ప్రాపంచికంగా అంటే త్రిగుణాలలో ఒక గుణం వైపు ఉంటూ మిగతా వాటిని ద్వేషిస్తే, అది కర్మే అవుతుంది. దీని వలన పాప-పుణ్యాలు మీకు తప్పక అంటుకుంటాయి.

ఉదాహరణకు దైవంతో ఉండి యుద్ధం చేసి చంపినా కూడా అర్జునుడికి ముక్తి లభించింది. అదే దేశ రక్షణ కోసం సైనికులు ప్రతీకార వాంఛతో యుద్ధం చేస్తే కొందరికి మరణం ప్రాప్తిస్తోంది, అంటే మంచి చేస్తే చెడు జరుగుతోంది, అదే అర్జునుడు విషయంలో చెడు చేసినా ముక్తి లభించింది. అంటే కర్మఫలం అనేది పనులను బట్టి ఏర్పడదని, ఆ పనులు ఏ ఉద్దేశ్యంతో చేస్తున్నారనే దాని మీదనే కర్మఫలం అనేది ఏర్పడుతున్నదని అర్ధమౌతుంది. కనుక అత్యవసరమైన పనులు కాకుండా మిగతా పనులన్నింటినీ రాగ-ద్వేషాలకు అతీతంగా చేరిన తర్వాతే చేయడానికి ప్రయత్నించండి.

## ప్రార్ధన

రాగ-ద్వేషాలకు అతీతంగా చేరితే మీరు దేని వెనకాల పరిగెత్తవలసిన అవసరం ఏర్పడదు. ఎందుకంటే అంతరంలో ఎలాంటి చలనం ఉండదు, కేవలం నిశ్శబ్ధంతో ఉన్న చైతన్యం మాత్రమే ఉంటుంది. ఈ చైతన్య స్థితిలో ఉండడమే ప్రార్ధన చేయడం అంటే. కాని దీని అర్ధం ఎలాంటి చర్యలు ఉండవని కాదు, కేవలం ఫలాపేక్ష ఉండదు. దీని వలన మీరు చేసే పనులు కేవలం ఒక సరదా ఆటలా నాటకంలా ఉంటాయి, ఎలాంటి పిచ్చితనం ఎలాంటి గంభీరత్వం లేకుండా.

ఫలాపేక్ష ఉన్నవాడు, ఏదో ఒక కర్మ చేయకుండా ఉండలేని వాడు, సరదాగా ఆటను ఆడలేడు. ఒక వేళ ఆటను ఆడినా ఆ ఆటను ఎలా ఆడతాడంటే, దానిని ఎంత సీరియస్‌గా తీసుకుంటాడంటే, ఆ ఆటను కూడా పనిగా మార్చేంతగా. కాని నిజమైన ప్రశాంత మనస్సు కలిగినవాడు, పనిని కూడా సరదా ఆటలా పరివర్తన చెందిస్తాడు. ఫలాపేక్ష లేనప్పుడే మీరు ఆడుకోగలుగుతారు - దాని ద్వారా మీకు ఏమీ

లభించక పోయినప్పటికీ, మీకు ఎలాంటి అసంతృప్తి కలగదు, ఎందుకంటే కర్మ చేస్తున్నప్పుడే మీకు కావలసిన ఆనందం తృప్తి లభిస్తుంది.

అందుకే యోగంలో లేని పెద్దలు ఆటను సరదాగా ఆడలేరు. పిల్లలు మాత్రమే ఏమీ ఆశించకుండా ఆడగలుగుతారు. అందుకే వాళ్ళ ఆటలో అమాయకత్వము, సౌందర్యమూ ఉంటాయి. కేవలం ఆడడమే వాళ్ల ఆనందానికి సరిపోతుంది. ఆడుతున్నప్పుడు వాడు ఆ ఆటలో పూర్తిగా పాల్గొంటాడు. ఎందుకంటే వాడు దైవంతో ఎల్లప్పుడూ మమేకమై ఉంటాడు. దైవం వేరు నేను వేరు అనే భావనలో ఉంటే వాడు కూడా ఆటలో సంపూర్ణంగా పాల్గొనలేడు.

పిల్లవాడు ఆట ద్వారా చిన్న ఫలితాన్ని కూడా ఆశించడు, అక్కడికి ఇక్కడికి పరిగెడుతూ కదులుతూ ఉంటాడు. తనలోని చిన్న చైతన్య భాగం కూడా పాల్గొనకుండా వెనకాల దేనినో ఆశిస్తూ వేచి ఉండదు. అందులో మొత్తం చైతన్యం పాల్గొంటుంది. పూర్తిగా పాల్గొంటూ ఇక్కడే ఈ క్షణంలోనే ఉంటూ ఆటగానే పిల్లవాడు తయారవుతాడు. చిన్న భాగం కూడా దేనినో ఆశిస్తూ అతీతంగా ఉండదు. ఈ విధంగా చేయడమే ఫలాపేక్ష లేకుండా చర్య చేయడమంటే. కనుక మీరు కూడా ఇలా పూర్తిగా పాల్గొంటూ నిత్యజీవితంలో అన్ని పనులను చేయడానికి ప్రయత్నించండి.

చర్యలు లేదా పనుల యొక్క కారణాన్ని నిలిపివేయడమే ప్రార్థన. అనగా కర్మఫలితాన్ని వదిలేయడమే ప్రార్థన అంటే. ఈ ప్రార్థన యొక్క ఉద్దేశ్యం ఏమిటంటే, అమాయకంగా, స్వచ్ఛంగా చిన్న పిల్లవాడిగా ఉండమని. అప్పుడే మీరు నిజమైన ప్రార్థన చేసినట్టు. అప్పుడు మీ ప్రార్థనను తిరస్కరించడం అసాధ్యం. నిజంగా అప్పుడు ప్రార్థించ వలసిన అవసరం లేకుండానే దైవం మీలోకి ప్రవేశిస్తాడు, ఎందుకంటే అందుకు కావలసిన పరిస్థితిని మీరు సృష్టించారు. రాగ-ద్వేషాలకు అతీతంగా మీరున్నారు కనుక దైవం మీ ముందు ప్రత్యక్షమౌతాడు.

కాబట్టి కేవలం తినండి, కాని దీని ద్వారా ఆరోగ్యం లేక అనారోగ్యం వస్తుందని ఆశించకండి. వంట వండేటప్పుడు బాగా చేయాలని ఆశించకండి. పని చేయండి, కాని దీని ద్వారా ధనం లభిస్తుందని ఆశించకండి. ఎందుకంటే ఆశిస్తే తెలిసినదే చేస్తారు కాని కొత్తది ప్రయత్నించరు. ఇలా చేసి భవిష్యత్తులో ఏం జరుగుతుందనే విషయాన్ని మీ దైవానికి వదిలేయండి. కాని మొదట్లో ఆశిస్తూనే చేస్తారు, అది తప్పేమీ కాదు, అలా చేయడాన్ని కూడా అంగీకరించి సాధనను కొనసాగిస్తే తప్పకుండా ఏమీ ఆశించకుండా పనులను చేసే స్థితికి చేరుతారు. మీరు కోరికలకు అతీతంగా అంటే రాగ-ద్వేషాలకు అతీతంగా చేరితే, మీ కదలికలనేవి ఆగిపోతాయి మరియు ఎప్పుడైతే మీ కదలికలు ఆగిపోతాయో, అప్పుడే ఈ వర్తమాన క్షణంతో మీ కలయిక అనేది సంభవమౌతుంది. ఈ కలయిక వలననే దైవానికి చేరే ద్వారం తెరుచుకుంటుంది.